ఆలయ ముఖ మండపంలో సెల్ఫీలు దిగుతున్న కాంగ్రెస్ నాయకులు

గుట్ట ఆలయంలో కాంగ్రెస్ నాయకుల హల్ చల్

- సెల్‌ఫోన్లతో సెల్ఫీలు దిగుతూ నానా హంగామా..

యాదగిరిగుట్ట, జూన్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హల్‌చల్ చేశారు. ఆలయ ముఖ మండపంలో సెల్‌ఫోన్లతో ఇష్టారాజ్యంగా సెల్ఫీలు దిగుతూ భక్తులకు ఇబ్బంది కలిగించారు. గురువారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్వామివారి దర్శనానికి వచ్చారు.

వారితో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సుమారు 200 మందికి పైగా ఆలయంలోకి ప్రవేశించారు. ముఖ మండపంలోకి చేరి సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగుతూ దేవస్థాన అధికారులు ఎంత అభ్యర్థించినా పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహించారు. ఆలయంలోకి సెల్‌ఫోన్లను అనుమతినివ్వడం లేదని, భక్తులెవరూ సెల్‌ఫోన్లు వినియోగించరాదని ఈఓ, ఏఈఓ, ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఎంత చెప్పినా కాంగ్రెస్ నాయకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు

- సీఎస్ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సుల అందజేత కార్యక్రమాలను సమీక్షించారు. రైతులందరికీ విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని, పోలీసు, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించాలని, కంట్రోల్ రూముల ఏర్పాటుతో నిఘా పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. విత్తన డీలర్ల రిజిస్టర్లను తనిఖీ చేయాలని, ప్రతి రోజూ డీలర్ల నుంచి రిపోర్టులు పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సందర్భంగా జూన్ 11 లోగా విద్యార్థులకు అందించే యూనిఫాం సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే విత్తనాలు, ఎరువుల గురించి వివరిస్తూ జిల్లాలో ఇప్పటి వరకు 78,345 పత్తి విత్తనాల ప్యాకెట్లు అమ్మడం జరిగిందని, ఇంకా 66,858 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, అలాగే ఎరువులకు సంబంధించి 14,117 మెట్రిక్ టన్నుల యూరియా, 829 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,160 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్, 375 మెట్రిక్ టన్నుల పొటాష్, 186 మెట్రిక్ టన్నుల సూపర్ పాస్ఫేట్ అందుబాటులో ఉన్నాయని, రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీకి సంబంధించి క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారి సునంద, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, జూన్ 6 : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణ కేంద్రంలోని పైలాన్ పార్కులో ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యజీవితంలో పర్యావరణ హితమైన అలవాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కామిశెట్టి శైలజ, బాబాషరీఫ్, కొరగోని లింగస్వామి, సుల్తాన్ రాజు, నాయకులు భాస్కర్, బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ విప్ అయిలయ్య జన్మదిన వేడుకలు

రాజాపేట, జూన్ 6 : మండలంలోని రఘునాథపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం విజయవాడలోని కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అయిలయ్యకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుడిగె పెంటయ్య, బింగి రమేశ్, కటకం ప్రశాంత్, బల్ల యాదేశ్, గణేశ్, డొంకెన భాస్కర్, పరమేశ్, నరేందర్, సత్యనారాయణ, స్వామి, వెంకటేశ్, కిరణ్, శివ, అశోక్, భాస్కర్, చింటు, రాజు పాల్గొన్నారు.

కారులో దూరిన నాగుపాము

భువనగిరి కలెక్టరేట్, జూన్ 6 : మండలంలోని అనంతారం శివారులోని స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుడి కారులో నాగుపాము దూరిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సిద్దిపేట మండలం సీతారాంపూర్‌కు చెందిన రవి కారును అతని స్నేహితుడు జగదీశః కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించారు. తిరుగు ప్రయాణంలో కారును తీస్తున్న క్రమంలో నాగుపాము కనపడింది. గమనించిన భక్తులు కారులోకి వెళ్లిన నాగుపామును బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

కలెక్టర్‌కు వినతి

స్వర్ణగిరి ఆలయానికి వస్తున్న భక్తులకు సరియైన సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని, ట్రాఫిక్ ఇబ్బందులు కల్గిస్తున్న ఆలయ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత నాయకుడు బట్టు రామచంద్రయ్య కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆలయ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు.

పలు గ్రామాల్లో బడి బాట ర్యాలీలు

మోత్కూరు, జూన్ 6 : మండలంలోని దత్తప్పగూడెం, పాలడుగు, దాచారం గ్రామాల్లో గురువారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఏపీ కమిటీల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఏఏపీ సభ్యులు, వీఓఎలు పాల్గొన్నారు.

విజ్ఞాన నిలయాలు సర్కారు బడులు

- డీఈఓ అశోక్ జిల్లా వ్యాప్తంగా
- బడిబాట కార్యక్రమం ప్రారంభం
- ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ప్రచారం

పెన్‌పహాడ్, జూన్ 6 : విద్యార్థుల్లో సంపూర్ణ మూర్తిమత్వాన్ని వికసింపజేస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తూ విజ్ఞాన నిలయాలుగా సర్కారు బడులు వెలుగొందుతున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి కె.అశోక్ అన్నారు. గురువారం పెన్‌పహాడ్‌లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యమైన డిజిటల్ విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉచిత యూనిఫామ్, నాణ్యమైన తాగునీటి సౌకర్యం, విశాలవంతమైన తరగతి గదులు, ఆట స్థలాలు, కార్పొరేట్‌కు మించి సౌకర్యాలు ఉన్న సర్కారు బడుల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. అలాగే చీదెళ్లలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేకల రాజశేఖర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జమాల్ షరీఫ్, కేజీబీవీ ఎస్ఓ ఆసియాజబీన్, వీరేందర్, సుశీల, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : ఎంఈఓ చత్రునాయక్

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా అంతా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధనే కాకుండా ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందజేస్తున్న విషయాన్ని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, హెచ్ఎం బట్టు మధు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇంజమరి శ్రావణి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చిలకరాజు శ్రీను, విశ్రాంత ఉపాధ్యాయులు పూర్ణచంద్రారెడ్డి, బుద్దారెడ్డి, మెప్మా ఆర్పీలు ఉష, సరిత, నాగలక్ష్మి, కృష్ణకుమారి, రోజా, నాగమణి పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్ : మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం పుల్లయ్య, ఉపాధ్యాయులు బచ్చని గురువయ్య, బండగొర్ల లింగయ్య, అత్తి శంకర్, సావిత్రమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామం ఎస్సీ కాలనీ మండల ప్రజా పరిషత్ పాఠశాల నేతృత్వంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులను బడిలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, జానీబేగం, అంగన్‌వాడీ టీచర్ అశ్విని పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండలంలోని గుడితండ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాజతండా హెచ్ఎం గోసుల వెంకన్న ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామ సమాఖ్య వారితో బడిబాట కార్యచరణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లకావత్ బిచిలి, అంగన్‌వాడీ టీచర్ గుగులోతు రజిత, గ్రామ సమాఖ్య సహాయకులు గుగులోతు నర్సింగనాయక్ పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్ఎం ఉయ్యాల ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎర్రపహాడ్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరం వెంకటయ్య, అయోధ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెచ్ఎం వర్దెల్లి కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, స్నేహలత, కొండ వెంకన్న, ఎన్.వెంకన్న, మురళీకృష్ణ, మాధవి, రహీన, సైదులు, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్‌లో ర్యాలీలో పాల్గొన్న డీఈఓ అశోక్

తిరుమలగిరి : తొండ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్.ఎస్ : కోటపహాడ్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : తిమ్మాపురంలో బడిబాట కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

నూతనకల్ : ఎర్రపహాడ్ గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తుంగతుర్తి : గుడితండాలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

వైద్యం కోసం ప్రజల పడిగాపులు

- ఆత్మకూర్.ఎస్ పీహెచ్‌సీలో సమయపాలన పాటించని వైద్య సిబ్బంది
- రోగులకు అందని వైద్యం

ఆత్మకూర్.ఎస్ పీహెచ్‌సీలో వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

ఆత్మకూర్.ఎస్, జూన్ 6 : పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధికంగా నిధులు ఖర్చు చేసి వైద్య సేవలు అందించే ప్రయత్నం చేస్తుండగా కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. మండల కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యాధికారి లేకపోవడంతో కందగట్ల సబ్ సెంటర్‌లో పని చేసే వైద్యాధికారి మండల ఇన్‌చార్జిగా ఉండడంతో ఇటు కందగట్లలో అటు మండల కేంద్రంలో విధుల నిర్వహణ భారంగా మారుతున్నది. మండల కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయ పాలన పాటించకుండా తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తూ వచ్చి వెళ్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. సబ్ సెంటర్‌తో పాటు మండల పీహెచ్‌సీలో డ్యూటీ నిర్వహించే వైద్యాధికారి సిబ్బంది పని తీరుపై చర్యలు తీసుకునే పరిస్థితులు లేవు. ఆలస్యంగా డ్యూటీకి రావడం, ఒక గంట, రెండు గంటలు డ్యూటీ చేసి మధ్యాహ్నానికి వెళ్లి పోతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. బుధవారం ఉదయం మండల పీహెచ్‌సీని సందర్శించగా ఉదయం 10 గంటల తర్వాత వైద్యాధికారి 10.30కి సీ హె చ్ ఓ సిబ్బంది విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నానికి ఆస్పత్రిలో డ్యూటీ ఏఎన్ఎం, సూపర్‌వైజర్ తప్ప అందరూ వెళ్లిపోయారు. మండల వైద్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎనిమిది మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉన్నది. కాగా ఉదయం 11 గంటల వరకు సిబ్బంది సక్రమంగా రాకపోవడం, మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహించాల్సి ఉండగా ఇక్కడి వారికి అక్కడనున్నట్లు అక్కడి వారికి ఇక్కడున్నట్లు చెప్పకుంటూ ఎక్కడా విధులకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సబ్ సెంటర్లలో ఆశ కార్యకర్తలు అన్నితామై విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ వీరేంద్రనాథ్‌ను వివరణ అడుగగా తాను గురువారమే బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సిబ్బంది సమయపాలనపై తనకింకా తెలియదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

ఉదయం 10 గంటల వరకు తెరుచుకోని ఏపూరు ఆరోగ్య ఉప కేంద్రం

బస్సులను పునరుద్ధరించాలని వినతి

బొమ్మలరామారం, జూన్ 6 : మండలంలోని మర్యాల గ్రామానికి భువనగిరి నుంచి వయా మర్యాల, చీకటిమామిడి మీదుగా ఈసీఐఎల్ వరకు కుషాయిగూడ డిపో బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మన్నె శ్రీధర్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మర్యాల బస్సు నాలుగు ట్రిప్పులు నడవడంతో ఎంతో సౌకర్యంగా ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కుషాయిగూడ బస్సులు ఆపివేయడంతో వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

డీహెచ్‌పీఎస్ శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

బొమ్మలరామారం, జూన్ 6 : ఈ నెల18 నుంచి మూడ్రోజులపాటు యాదగిరిగుట్టలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాషపాక దయాకర్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి మండల కమిటీ సభ్యులు చిప్పల జయమ్మ, సీపీఎం మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం, వడ్లకొండ భారతమ్మ, కొమ్మ బాలనర్సింహ, ఉడుత మైసయ్య, మురళి పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

- సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

గరిడేపల్లి, జూన్ 6 : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు అందివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పిందన్నారు. నేడో, రేపో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను మొదలుపెట్టి అర్హులందరికీ అందించాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల హామీలను నెరవేర్చాలి

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్

చౌటుప్పల్, జూన్ 6 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్, వనం ఉపేందర్ కోరారు. చౌటుప్పల్ మార్కెట్ యార్డ్‌లో గురువారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తమపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో తుంగ భూపాల్‌రెడ్డి, బొల్లేపల్లి స్వామి, కొత్త లలిత, ఏర్పుల శివయ్య, సంజీవ, శంకర్, పార్వతి పాల్గొన్నారు.

పొలంలో ట్రాక్టర్‌తో చెరువు పూడిక మట్టి పోస్తున్న రైతు

సేంద్రియ ఎరువులతో సాగుకు రైతుల మొగ్గు

- పశువుల పేడ, చెరువు పూడిక మట్టి తోలకానికి రైతుల పోటీ
- పెరుగుతున్న ఎరువుల ధరలే కారణం

పాలకవీడు, జూన్ 6 : వ్యవసాయంలో పంట దిగుబడులు నానాటికి తీసికట్టు అవుతున్నాయి. అధిక రసాయనిక ఎరువులు దానికి కారణం అవుతున్నాయి. భూసారాన్ని పెంపొందించుకోవడం కోసం, అధిక దిగుబడి సాధించడం కోసం రైతులు తమ ఆలోచనలను క్రమంగా మార్చుకుంటున్నారు. ప్రతీ యేటా రసాయన ఎరువుల ధరలు పెరుగడం, ఎంత ఖర్చు పెట్టినా దిగుబడులు తగ్గుతుండడంతో ఈ యేడాది అధిక శాతం రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించారు. దానికి తోడు ఈ ఏడాది చెరువులన్నీ ఎండిపోయి చెరువు మట్టి సులువుగా లభ్యం కావడంతో పూడిక మట్టిని తమ పొలాల్లో పోయించుకుంటూ భూములను సారవంతం చేసుకుంటున్నారు. భూసారాన్ని పెంపొందించుకోవడం కోసం రైతులు ఇతర ప్రత్యామ్యాయ మార్గాలను అనుసరిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రైతులు అంతగా మిశ్రమ ఎరువులు వాడకుండానే పంట పొలాల్లో మేలైన అధిక దిగుబడి సాధించేవారు. ఇందుకు కారణం సేంద్రీయ ఎరువుల వాడకమే. క్రమంగా రసాయన ఎరువుల వాడకం పెరుగడం వల్ల పొలాలలో భూసారం తగ్గుకుంటూ వచ్చింది. మిశ్రమ, రసాయన ఎరువులతో అధిక పెట్టుబడులు అవుతున్నాయి. దాంతో రైతులు చెరువులో మట్టి పూడిక, సేంద్రీయ ఎరువులపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో అధికంగా భూసారాన్ని పెంపొందించుకునే అవకాశాలు కానరావడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. దాంతో చాలా మంది రైతులు చెరువు పూడిక మట్టిని తమ పొలాల్లోకి తరలిస్తూ భూములను సారవంతంగా మార్చుకుంటున్నారు.

వీటి వినియోగంతో నేలలు సారవంతం : పశువుల పేడ, చెరువు పూడిక మట్టి పొలాల్లోకి తోలుతుండడంతో నేలలు సారవంతంగా మారుతాయని, నేలలు పదులుగా మారి పంటల ఎదుగుదలకు ఎంతో దోహద పడుతాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రెండు సంవత్సరాల పాటు భూమిలో బలం ఉంటుందని, పంటలు ఆశాజనకంగా పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకున్న రైతులు గ్రామాల్లో చెరువు మట్టి తోలకం కోసం పోటీ పడుతున్నారు. ప్రతీ రైతు 100 నుంచి 200 ట్రిప్పుల చెరువు మట్టిని తమ పొలాల్లో తోలుకుంటున్నాడు. చెరువు మట్టి వల్ల పొలాల్లో నీటి నిల్వకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

సేంద్రియ ఎరువులతో భూములు సారవంతం

చెరువు పూడిక మట్టిని, పశువుల పేడతో కూడిన ఎరువులను రైతులు తమ పొలాల్లో పోసుకోవడం వల్ల భూములు సారవంతం అవుతాయి. దాంతో ఎరువుల భారం తగ్గడమే కాకుండా నేల సారవంతం అవుతుంది. పూడిక మట్టి, సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రెండు విధాల ప్రయోజనం కలుగుతుంది. పెట్టుబడులు తగ్గించుకోవచ్చు. అధిక దిగుబడులు పొందవచ్చు. రసాయన ఎరువుల వాడకం వల్ల నేల సారం దెబ్బతిని ఆశించిన మేర దిగుబడులు రావు. రైతులు ఎప్పడికప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా ఎరువుల వాడకం చేపట్టాలి.

– బి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి, పాలకవీడు